## క్లుప్తంగా

### హనుమాన్ ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం



**నర్సంపేట :** చెన్నారావుపేట మండలంలోని 16 చింతల్‌తండాలోని నక్కలగుట్ట నర్సింహ స్వామి ఆలయం ఎదుట హనుమాన్ ఆలయ నిర్మాణ పనులను దాత బోడ బద్దునాయక్ సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. భక్తుల కోసం వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల సోషల్ మీడియా ఇన్‌చార్జ్ బోడ మురళినాయక్, అర్చకుడు శ్రీనివాస్, వెంకటాద్రి, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

### సన్మానం



**నర్సంపేట రూరల్ :** స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తూ ఏఎస్సైగా భద్రాద్రి కొత్తగూడెంకు బదిలీ అయిన మంద బాబుతోపాటు వరంగల్ కమిషనరేట్‌కు బదిలీ అయిన కానిస్టేబుళ్లు ఆరె కృష్ణ, గంగుల శ్రీనివాస్, బొక్కల శ్రీనివాస్, భూసాని స్వామి, కోట రాజులను టౌన్ సీఐ రఘుపతిరెడ్డి సోమవారం శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు రవికుమార్, గూడ అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

**బదిలీ అయిన పోలీసులకు..**



**దుగ్గొండి :** స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుళ్లుగా పని చేస్తూ బదిలీ అయిన కానిస్టేబుళ్లు శేఖర్, రాకేశ్, రమేశ్, షబ్బీర్‌లను సీఐ సాయిరమణ, ఎస్సై రావుల రణధీర్‌రెడ్డి శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. జ్ఞాపికలు అందించి వీడ్కోలు పలికారు. అనంతరం సీఐ మాట్లాడారు. విధినిర్వహణలో సమర్థత చాటాలని సూచించారు.

### ఏపీఎంలుగా బాధ్యతల స్వీకరణ


సుధాకర్


రాజ్‌కుమార్

**నల్లబెల్లి/సంగెం :** నల్లబెల్లి, సంగెం మండలాల ఏపీఎంలుగాగా కందిక సుధాకర్, గుజ్జుల రాజ్‌కుమార్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయా మండలాల్లో పని చేసిన ఏపీఎంలు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వారికి సీసీలు, సిబ్బంది శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

### వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

**దుగ్గొండి :** మండలంలోని గిర్నిబావిలో అఖిల భారత ఓబీసీ 10వ మహాసభల వాల్‌పోస్టర్లను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పెండ్యాల రాజు సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. జనాభాలో 56 శాతంగా ఉన్న బీసీలకు ఆ ప్రకారం రిజర్వేషన్ కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీలు రాజ్యాధికార దిశగా ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈనెల 7 గోవాలో మహాసభలు నిర్వహిస్తామని తెలిపారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు డ్యాగల శ్రీనివాస్, నాయకులు కడారి సురేశ్, కొత్తపల్లి శివ, ముత్యాల స్వామి, కొలిపాక సుధాకర్, మద్దెల కొమురయ్య, ఆలేటి నాగరాజు, నాగెల్లి విజయ్, భరత్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

**నర్సంపేట :** చెన్నారావుపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కరిమిల్ల అర్జున్ సమకూర్చిన స్కూల్ బ్యాగులను స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం పాపమ్మ సోమవారం పంపిణీ చేశారు. అనంతరం హెచ్‌ఎం పాపమ్మ మాట్లాడారు. విద్యార్థులకు బ్యాగులు సమకూర్చడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు క్రమం తప్పకుండా స్కూల్‌కు వచ్చి చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం ఈదునూరి రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు సూరయ్య, అనిల్ కుమార్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# వేతనాలు అందక వెతలు

- ఔట్ సోర్సింగ్ కార్మికుల వేదన
- విధులు నర్సంపేటలో.. రెన్యూవల్ వర్ధన్నపేటలో..

**నర్సంపేట రూరల్ :** ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెన్యూవల్ చేయకపోవడంతో వేతనాలు అందక ఆస్పత్రి సిబ్బంది ఐదు నెలలుగా ఇబ్బంది పడుతున్నారు. నర్సంపేట ఆస్పత్రి నుంచి రిలీవింగ్ ఆర్డర్లు ఇవ్వడం లేదు. ఈ క్రమంలో వర్ధన్నపేటలో పని చేయాలా..? లేక నర్సంపేటలోనే విధులు నిర్వర్తించాలా? అనే సందిగ్ధంలో కార్మికులు ఉన్నారు. నర్సంపేటకు సిబ్బంది కేటాయింపు జరిగే వరకు వారిని డిప్యూటేషన్‌పై కొనసాగించాలని నర్సంపేట ఆస్పత్రి అధికారులు ప్రయత్నిస్తున్నారు. జీతాలు అందించాలని కార్మికులు వేడుకుంటున్నారు.

నర్సంపేటలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో మూడు కేటగిరీల్లో 15 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కొక్కరు సుమారు 10–14 ఏళ్ల నుంచి కొనసాగుతున్నారు. నామమాత్రపు వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారు. కనీస వేతన చట్టం ప్రకారం వారికి జీతాలు అందడంలేదు. ఐదు నెలలుగా జీతాలు అందడం లేదు. వారిని ఏటా మార్చిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏజెన్సీ రెన్యూవల్ చేయాల్సి ఉండగా ఆగస్టులో వర్ధన్నపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రెన్యూవల్ చేశారు. నర్సంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా ఉన్నప్పుడు వారికి నర్సంపేటలోనే వేతనాలు అందాయి. కాగా నర్సంపేట ఆస్పత్రి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మెడికల్ కళాశాలగా అప్‌గ్రేడ్ కావడంతో టీవీవీపీ సిబ్బందిని జిల్లాలోని ఏకైక టీవీవీపీ ఆస్పత్రిగా ఉన్న వర్ధన్నపేట ఆస్పత్రికి బదిలీ చేశారు. దీంతో మార్చి వరకు వీరు అక్కడ విధులు నిర్వహించి అప్పటి నుంచి ప్రభుత్వ హామీతో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్నారు. వీరిని డీఎంఈకి మార్చి నర్సంపేట ఆస్పత్రిలోనే విధులోకి తీసుకుంటామని హామీ సైతం ఉంది. అయినా ఉన్నతాధికారులు వర్ధన్నపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిధిలో టీవీవీపీ ఆధ్వర్యంలో రెన్యూవల్ చేశారు. మార్చి నుంచి జూలై వరకు జీతాలు అందాలంటే తప్పనిసరిగా నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రి నుంచి రిలీవ్ అయి వర్ధన్నపేట ఆస్పత్రిలో జాయిన్ కావాల్సిందేనని డీసీహెచ్‌ఎస్ అధికారులు తేల్చి చెప్పడంతో సిబ్బంది అయోమయంలో పడిపోయారు. ఇన్ని రోజులు నర్సంపేటలో విధులు కొనసాగించి, చివరకు వర్ధన్నపేట ఆస్పత్రికి వెళ్లాలని చెప్పడంతో వేదనకు గురవుతున్నారు. వర్ధన్నపేట ఆస్పత్రిలో జాయిన్ కావాలంటే నర్సంపేట ఆస్పత్రి నుంచి రిలీవింగ్ ఆర్డర్లు అందాలి. అవి రాకపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో కార్మికులు ఆందోళనకు గురవుతున్నారు.


నర్సంపేట జిల్లా ఆస్పత్రి

**కలెక్టర్ ఆదేశాల మేరకు..**



నర్సంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఉన్న సమయంలో పని చేసిన 15 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది రెన్యూవల్ గడువు మార్చితో ముగిసింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వారిని నర్సంపేట ఆస్పత్రిలో డిప్యూటేషన్‌పై కొనసాగిస్తాం. వేతనాలు సైతం చెల్లిస్తాం. నర్సంపేట ఆస్పత్రికి సిబ్బందిని నియమించే వరకు వీరు కొనసాగుతారు.

– రామ్మూర్తి, డీసీహెచ్‌ఎస్, వర్ధన్నపేట

# కేజీబీవీల్లో కిశోర రక్ష హెల్త్ క్యాంప్


ఖానాపురం : విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

**వర్ధన్నపేట/ఖానాపురం :** వర్ధన్నపేట, ఖానాపురం మండలాల్లోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయాల్లో (కేజీబీవీ) సోమవారం కిశోర రక్షా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట కేజీబీవీలో వైద్యాధికారి జునైద్ ఖాన్, పల్లె దవాఖానా వైద్యుడు కమల్ కిశోర్, వైద్యులు సురేశ్, రమేశ్, నిఖిల్, నేహా, సౌమ్య, స్వామి, మౌనిక విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఖానాపూర్‌లో డాక్టర్ జ్యోతి, ఎన్‌సీడీ నర్సింగ్ ఆఫీసర్, పల్లె దవాఖానా వైద్యురాలు కల్పన, సబిత విద్యార్థులను పరీక్షించారు. విద్యార్థినుల హెల్త్ ప్రొఫైల్ తయారు చేశారు. ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. భోజనానికి ముందు, అనంతరం చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. వర్షాకాలంలో ఆరోగ్య పరిరక్షణకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమాల్లో సీహెచ్‌ఓలు జ్ఞానసుందరి, రాజయ్య, సూపర్‌వైజర్లు రాజు, స్వర్ణకుమారి, దామోదర్‌రెడ్డి, ఎస్‌ఓలు కరుణశ్రీ, మేనక, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సారెస్పీ నీటి కోసం ఉద్యమిస్తాం


రాయపర్తి శివారు ఎస్సారెస్పీ కాల్వలో నిల్చుని మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

- బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహా

**రాయపర్తి :** ఎస్సారెస్పీ నీటి కోసం ఉద్యమిస్తామని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహా నాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి హెచ్చరించారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్ర శివారులోని ఎస్సారెస్పీ కాల్వలో శ్రేణులతో కలిసి వారు సోమవారం నడుస్తూ నిరసన తెలిపారు. అనంతరం నర్సింహా, అనిమిరెడ్డి మాట్లాడారు. కాల్వలకు సాగు నీటిని సాధించుకునే లక్ష్యంతో రాష్ట్రాన్ని సాధించుకోగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చెరువులను నింపకుండా మోసపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో అన్ని చెరువులూ ఎస్సారెస్పీ జలాలతో కళకళలాడాయని, కాంగ్రెస్ పాలనలోనే ఎండిపోతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. రైతులకు కనీసం సాగు నీరు, విద్యుత్ కూడా అందించడం లేదని మండిపడ్డారు. ఇకనైనా వెంటనే చెరువులన్నిటికీ ఎస్సారెస్పీ కాల్వ నీరు విడుదల చేయాలని, రైతుల ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో ఎస్సారెస్పీ కాల్వల నుంచి నీరివ్వకుంటే ఉద్యమం తప్పదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, నాయకులు ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, బద్దం వేణుగోపాల్‌రెడ్డి, గారె నర్సయ్య, ముద్రబోయిన సుధాకర్, రాము, గజవెల్లి ప్రసాద్, పోగులకొండ వేణు, సాయి, జీవన్, నరేశ్, లక్ష్మణ్, యాకూబ్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

### వైద్యశిబిరం

**నెక్కొండ :** ఆరోగ్య పరిరక్షణలో శుభ్రత కీలకమని పీహెచ్‌సీ వైద్యాధికారి సుమన్ తెలిపారు. మండలంలోని పనికర, చంద్రుగొండ గ్రామాల్లో సోమవారం జ్వర సర్వే నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ వర్షాకాలంలో జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని చెప్పారు. అనంతరం వైద్యశిబిరం ఏర్పాటు చేసిన పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు రాహుల్, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం

- బీజేపీ ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి

**నర్సంపేట :** రాబోయే ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో యువతకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని లింగ్యా తండాకు చెందిన నాయకుడు భూక్య నరేశ్‌తోపాటు పలువురు బీజేపీలో జిల్లా కౌన్సిల్ మెంబర్ దుంకదువ్వ రంజిత్ ఆధ్వర్యంలో చేరగా వారికి జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మోసపూరిత హామీలపై ప్రజలు విసుగు చెందారని చెప్పారు. గత బీఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి హామీలు గుప్పించి తదనంతరం మోసం చేయడాన్ని ప్రజలు గుర్తిస్తున్నారని తెలిపారు. ఆ రెండు పార్టీలకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దామెరుప్పుల శేఖర్, ఉపాధ్యక్షుడు కందాల చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శులు కేసరి సాంబరాజు, మురహరి విజయ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఎర్ర రాజు, నాయకులు పాల్తియా శౌందర్, మరాటి ఉప్పలయ్య, భానోతు నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

### వనమహోత్సవం




**ఖానాపురం :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం వనమహోత్సవం నిర్వహించారు. అధ్యాపకులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సదానందం మాట్లాడారు. విద్యార్థులు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. జీవజాతులకు మనుగడలో మొక్కల సంరక్షణ కీలకమన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఎస్ పీఓ పరాచికపు సదానందం, అధ్యాపకులు విజయ్‌కుమార్, రవికుమార్, సంజీవ, తిరుపతమ్మ, కేశవరెడ్డి, అనిల్, సుధీర్‌కుమార్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్గత ఆడిట్‌తోనే పారదర్శకత సాధ్యం

- ఏపీఎం రమణాచారి

**వర్ధన్నపేట :** అంతర్గత ఆడిట్‌తోనే గ్రామ, మండల సమైక్య సంఘాల లావాదేవీల్లో పారదర్శకత సాధ్యమని ఏపీఎం రాచకొండ రమణాచారి తెలిపారు. మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో గ్రామైక్య సంఘాల వీఓఏలతో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్దేశిత గడువులోపు లక్ష్యాలను పూర్తి చేసే దిశగా వీఓఏలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దని చెప్పారు. సెర్ప్ సీబీఓ ఆడిటర్ వెంకట్ ఆధ్వర్యంలో చేపట్టిన అంతర్గత ఆడిట్‌లను సీసీలతో కలిసి రమణాచారి పరిశీలించారు. సమావేశంలో మండల సమైక్య అధ్యక్ష, కార్యదర్శులు, సీసీలు గోలి కొమురయ్య, స్వామి, రమేశ్, అనిల్, ఆడిటర్ వెంకట్, వీఓఏలు పద్మ, జ్యోతి, కవిత, సరిత, శోభ, హైమ, దయాకర్, సుమన్, స్రవంతి, కవిత, మంజుల, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీఎం రమణాచారి

# హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలి

- పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రవి

**నర్సంపేట :** సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ముక రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో సోమవారం నిర్వహించిన సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ హాస్టళ్లలో, ఆశ్రమ పాఠశాలల్లో, కేజీబీవీల్లో తాగునీటి, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం డైట్ చార్జీలు సకాలంలో విడుదల చేయకపోతుండడంతో మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం సాధ్యం కావడం లేదన్నారు. నెలల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నట్లు తెలిపారు. అద్దె భవనాల్లో కొనసాగుతోన్న హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, ప్రతినెలా వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని, వార్డెన్లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నవీన్, రాకేశ్, రమేశ్, శ్రీకాంత్, వినయ్, సుజాత, రాధిక, అనూష, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రవి

### తల్లిపాల వారోత్సవాలు



**వర్ధన్నపేట/నర్సంపేట :** వర్ధన్నపేటలోని 6వ వార్డులోని, చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేటలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలితా కుమారి, అమీనాబాద్‌లో అంగన్‌వాడీ టీచర్ రాధిక తల్లులు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు.

# పద్మశాలి సంఘం బలోపేతానికి కృషి


సభ్యత్వం ఇస్తున్న సాంబయ్య, నాయకులు

- పట్టణ అధ్యక్షుడు సాంబయ్య

**నర్సంపేట :** పట్టణంలో పద్మశాలి సంఘం బలోపేతానికి కృషి చేస్తున్నట్లు సంఘం పట్టణ అధ్యక్షుడు గాజుల సాంబయ్య తెలిపారు. మార్కండేయ నగర్‌లో సోమవారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి సాంబయ్య సభ్యత్వం అందజేసి మాట్లాడారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో సభ్యత్వ నమోదు చేపడతామని చెప్పారు. జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ రాంపెల్లి లింగమూర్తి మాట్లాడుతూ సంఘం సభ్యులు, బాధ్యులు సోషల్ మీడియాలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు. పద్మశాలి మహిళలు కూడా చురుకుగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి బాల్నె జగన్, బాసాని సుదర్శన్, బలభద్ర రవీందర్, పెండెం భాస్కర్, ఆడెపు చంద్రశేఖర్, ఆడెపు రాజయ్య, సమ్మయ్య, బంక పరమేశ్, తుమ్మ ఏకాంబ్రం, జడల శ్రీను, ఆడెపు రమేశ్, మార్త రాజేందర్, గుల్లపెల్లి సుధాకర్, వెల్దండి మార్కండేయ, వడిచర్ల సురేశ్, బూర చందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

# నేటి ధర్నాను విజయవంతం చేయాలి

**పర్వతగిరి :** హనుమకొండలోని ఏకశిలా పార్క్ వద్ద నేడు (మంగళవారం) నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని డీటీఎఫ్, యుటీఎఫ్, టీపీటీఎఫ్ మండల బాధ్యులు మహంకాళి రామస్వామి, సంపత్, మల్లికార్జున్ ఉపాధ్యాయులను కోరారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ధర్నా కరపత్రాలను వారు సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. ధర్నాకు మండలం నుంచి ఉపాధ్యాయులందరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో మండల కోకన్వీనర్ సంపత్, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం పాక రమేశ్ బాబు, ఎంపీపీఎస్ హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి రమేశ్, డీటీఎఫ్ ఉపాధ్యక్షుడు ఎల్ల రాజు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, నాయకులు కిషన్ నాయక్, ప్రసాద్, లక్ష్మారెడ్డి, శాంతికిరణ్, శ్వేత, మౌనిక, లలితాదేవి, తదితరులు పాల్గొన్నారు.

**చెన్నారావుపేటలో..**

**నర్సంపేట :** చెన్నారావుపేటలో నిర్వహించిన సమావేశంలో డీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఆంగోతు భద్రయ్య, ప్రధాన కార్యదర్శి ఉమా శంకర్ మాట్లాడారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూఎస్‌పీసీ జిల్లా స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో నేడు ఉదయం 10 గంటల నుంచి ధర్నా చేస్తామన్నారు.

### నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

**పర్వతగిరి :** మండలంలోని ఏనుగల్లు సబ్‌స్టేషన్‌లో నేడు (మంగళవారం) ఉదయం 10.30 నుంచి విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని ఆ శాఖ ఏడీఈ తిరుపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు.

### ‘గృహలక్ష్మి’ బిల్లులు చెల్లించాలి

**దుగ్గొండి :** గత ప్రభుత్వ హయాంలో గృహలక్ష్మీ పథకం కింద నిర్మించుకున్న ఇళ్లకు సంబంధించి బిల్లులు చెల్లించాలని కోరుతూ మండలంలోని తిమ్మంపేట మాజీ సర్పంచ్ మోడెం విద్యాసాగర్ ఆధ్వర్యంలో పలువురు లబ్ధిదారులు కలెక్టర్ సత్య శారదకు సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడారు. కలెక్టర్‌కు సమస్య వివరించారు.

### చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

**నర్సంపేట :** పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై లక్ష్మణమూర్తి కథనం ప్రకారం.. చెన్నారావుపేటకు చెందిన చెందిన పిట్టల ఉప్పలయ్య (48) ఈనెల 2న ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. కాగా ఉప్పలయ్య చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు.

**ఇస్లావత్‌తండాలో..**


వెంకన్న మృతదేహం

**పర్వతగిరి :** మండలంలోని ఇస్లావత్‌తండాకు చెందిన వెంకన్న (33) వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఆయన దౌలత్ నగర్‌లోని వ్యవసాయ భూమికి నడుచుకుంటూ వెళ్తుండగా స్పృహ కోల్పోయాడు. ఎంజీఎంలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పరామర్శ

**రాయపర్తి :** మండలంలోని కొలన్‌పల్లికి చెందిన గాజుల విజయ, బురహాన్‌పల్లిలో బండ ఎల్లయ్య ఇటీవల మృతి చెందగా ఇద్దరూ బీఆర్‌ఎస్ నాయకులు కాగా బాధిత కుటుంబాలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సోమవారం పరామర్శించారు. తొలుత మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, నాయకులు ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**నిమ్స్ అధికారికి..**

**గీసుకొండ :** మండలంలోని ఎలుకుర్తి హవేలిలో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రి లైజనింగ్ ఆఫీసర్ డాక్టర్ మార్త రమేశ్‌ను అతడి తండ్రి భద్రయ్య ఇటీవల మృతి చెందిన క్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు పగడాల కాళీప్రసాద్ పరామర్శించారు. తొలుత భద్రయ్య చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చొక్కం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొంగర రవికుమార్, ఉపాధ్యక్షుడు తుమ్మనపెల్లి శంకర్‌రావు, నాయకులు జాన్ విక్రమ్, ఆరకట్ల ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

### ‘ఎస్‌ఆర్‌ఆర్’ సాయం

**రాయపర్తి :** మండలంలోని తిర్మలాయపల్లి, ఏకేతండా, సూర్యతండాకు చెందిన పలువురు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం బియ్యం, ఆయిల్ క్యాన్, నగదు సాయం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండలంలోని పేద కుటుంబాలను ఆపద సమయంలో తప్పకుండా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. ఫౌండేషన్ సేవలను పేదలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూక్య సురేందర్ రాథోడ్, నాయకులు ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, బద్దం వేణుగోపాల్‌రెడ్డి, కక్రరవీందర్‌రెడ్డి, బిల్ల వెంకట్‌రెడ్డి, లేతాకుల మధూకర్‌రెడ్డి, గారె నర్సయ్య, గజవెల్లి ప్రసాద్, ఎండీ యాసుఫ్, మహేందర్‌రెడ్డి, కోల సంపత్, చిట్యాల వెంకన్న, వంగాల నర్సయ్య, సంకినేని ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

### ఇళ్ల నిర్మాణానికి అనుమతి తప్పనిసరి


గ్రామాల్లో ఇళ్ల నిర్మాణంపై ఫ్లెక్సీ ఏర్పాటు చేయిస్తున్న కార్యదర్శి సునీత

**గీసుకొండ :** ఇళ్ల నిర్మాణానికి జీపీ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని మచ్చాపూర్ పంచాయతీ కార్యదర్శి సునీత స్పష్టం చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణంపై ప్రజలకు పంచాయతీ కార్యదర్శులు అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్రమంలో మచ్చాపూర్‌లో అనుమతి తీసుకోకుండా ఇంటి నిర్మాణం చేపట్టిన స్వరూపకు పంచాయతీ కార్యదర్శి సునీత నోటీసు అందించి ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అనుమతి తీసుకోవాలని, నిబంధనల మేరకు మాత్రమే ఇంటి నిర్మాణం చేపట్టాలని చెప్పారు. ఆమె వెంట పంచాయతీ సిబ్బంది రఫీ. శ్రీనివాస్, ముత్తయ్య తదితరులున్నారు.